
## లోకం పోకడ



వస్తానన్న టైముకు రావు.. ఏ రోజు వస్తావో తెలియదు..
డుమ్మాలు కొడతావు.. ఇలాగైతే ఎలాగయ్యా?
టంచనుగా ఎలా రావాలో ఈయన్ని చూసి నేర్చుకో

## మిల్లులో ధాన్యం దింపుకోవాలని రైతుల ఆందోళన

- జాతీయ రహదారిపై ట్రాక్టర్లు అడ్డుపెట్టి నిరసన
- నారాయణపేట జిల్లా గుడెబల్లూరు వద్ద స్తంభించిన ట్రాఫిక్

మాగనూరు/కృష్ణ, మే 2 : ధాన్యాన్ని రైస్ మిల్లు యజమానులు దింపుకోవడంలో నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రైతులు ఆందోళనకు దిగారు. శుక్రవారం నారాయణపేట జిల్లా మాగనూరు మండలం గుడెబల్లూరులో జాతీయ రహదారిపై ధాన్యం తీసుకువచ్చిన ట్రాక్టర్లను అడ్డుపెట్టి ఆందోళన నిర్వహించారు. మాగనూరు, కృష్ణ మండలాల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని అధికారులు గుడెబల్లూరులోని పారజన్య రైస్‌మిల్లులో దింపాలని సూచించారు. ధాన్యాన్ని తీసుకువచ్చిన రైతులు రెండు,మూడు రోజులుగా ధాన్యం ట్రాక్టర్లు నిలుపుకొని మిల్లు వద్దే పడిగాపులు కాస్తున్నా మిల్లు యజమానులు వాటిని దించుకోవడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. ఇతర ప్రాంతాల నుంచి లారీల్లో వచ్చిన ధాన్యాన్ని దించుకొని రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని దించుకోకపోవడంతో ఆగ్రహించిన రైతులు ట్రాక్టర్లను జాతీయ రహదారిపై అడ్డుపెట్టి నిరసనకు దిగారు. దాదాపు గంటపాటు ఆందోళన నిర్వహించడంతో కిలోమీటర్ల పొడవునా ట్రాఫిక్ స్తంభించిపోయింది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వెంకటేశ్, ఎస్సై నవీద్, పీఏసీసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి అక్కడికి చేరుకొని వారి సమస్యను తెలుసుకున్నారు. పారజన్య రైస్ మిల్లులో దింపుకోవడానికి స్థలం లేకపోవడంతో కృష్ణ మండలం హిందూపూర్ శివారులోని వసుధ రైస్ మిల్లులో ధాన్యం దింపేందుకు ఏర్పాటు చేయడంతో రైతులు ఆందోళన విరమించారు.

## పొలం కబ్జా.. రైతు ఆత్మహత్య

- భూమిని ఇతరులు ఆక్రమించడంతో మల్లారెడ్డి తీవ్రమనస్తాపం
- జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల గ్రామంతో విషాదం



మల్లారెడ్డి (ఫైల్)

జగిత్యాల రూరల్, మే 2: తన భూమిని కొందరు ఆక్రమించడంతో మనస్తాపానికి గురైన ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషాదకర ఘటన జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల గ్రామంలో చోటుచేసుకున్నది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. పొరండ్ల గ్రామానికి చెందిన పడిగెల మల్లారెడ్డి (45)కి పోచమ్మ ఆలయం వద్ద ఎకరంన్నర భూమి ఉన్నది. ఏప్రిల్ 27న మల్లారెడ్డి తన భూమిని చదును చేయడానికి వెళ్లగా.. గంగారెడ్డి, జనార్దన్‌రెడ్డి, రాజిరెడ్డి, రాజవ్వ, రమ, లచ్చవ్వ అనే ఆరుగురు అక్కడికి వచ్చి ఈ భూమి తమదని, మరోసారి ఇక్కడికి వస్తే చంపేస్తామని బెదిరించడంతో మానసికంగా కుంగిపోయాడు. ఈ క్రమంలో గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు గుర్తించి వెంటనే కరీంనగర్‌లోని ఓ దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. భూ ఆక్రమణ విషయమై పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధిత కుటుంబ సభ్యులు వాపోయారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్ ఎదుట శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు నిరసన తెలిపారు. 20 ఏండ్ల నుంచి వారికి భూతగాదాలు ఉన్నాయని, ఇప్పటి వరకు తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి తెలిపారు. మల్లారెడ్డి భార్య అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు జగిత్యాల రూరల్ పోలీసులు తెలిపారు.

## బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

భూదాన్‌పోచంపల్లి, మే 2 : యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిలో పోచంపల్లి బ్యాంక్ కార్యాలయ భవన ప్రారంభం, చేనేత పరిశ్రమపై అవగాహన సదస్సుకు మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి హాజరవుతున్న సందర్భంగా శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషస్‌స్టేషన్‌కు తరలించారు. రూ.2 లక్షల వరకు చేనేత రుణమాఫీ చేయాలని, జియో ట్యాగ్ కలిగిన చేనేత కార్మికులకు చేనేత సహకార సంఘంలో సభ్యత్వం కల్పించాలని ఇటీవల బీఆర్‌ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. దీంతో ముందస్తుగా వారిని అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో బీఆర్‌ఎస్ పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి గునిగంటి మల్లేశ్‌గౌడ్, భువనగిరి నియోజకవర్గ యూత్ విభాగం మాజీ కన్వీనర్ చింతకింది కిరణ్, చేనేత నాయకుడు కొంక లక్ష్మీనారాయణ ఉన్నారు.

- ధాన్యం కొనండి మహాప్రభో



ప్రభుత్వం మార్కెట్లు, ఐకేపీ కేంద్రాల్లో సరైన సమయానికి ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులకు ఇక్కట్లు తప్పడంలేదు. దీంతో రైతులు రైస్‌మిల్లులను ఆశ్రయిస్తున్నారు. నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి మండలం కడంపల్లి, నాచారం శివారులో ఓ రైస్ మిల్ వద్ద ధాన్యం లోడుతో వాహనాలు బారులుతీరాయి. సీఎం రేవంత్‌రెడ్డి సొంత ఇలాకాలోనే పరిస్థితి ఇలా ఉంటే.. మిగతా ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

- ధాన్యం కొనండి.. దగా చేయొద్దు



రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేటలో ధర్నా చేస్తున్న రైతులు, మద్దతు తెలిపిన బీఆర్‌ఎస్ నేతలు

- రోడ్డెక్కిన రైతన్నా.. నిలిచిన వాహనాలు



సూర్యాపేట జిల్లా రాజానాయక్‌తండా వద్ద సూర్యాపేట-జనగామ రహదారిపై రైతుల ధర్నాతో భారీగా నిలిచిపోయిన వాహనాలు

# 25 రోజులైనా కాంటా పెడ్తలేరు

- మరీ గింత అన్యాయమా?



మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటలో కొనుగోలు కేంద్రం వద్ద సిబ్బందిని నిలదీస్తున్న రైతులు

- కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపులు
- వర్షమొస్తే తడుస్తదని ఆందోళన
- లారీలు వస్తలేవని, గన్నీబ్యాగులు లేవని నిర్వాహకుల సాకులు
- కొన్నిచోట్ల పైసలిస్తేనే కాంటా
- రైతుల రాస్తారోకో, ధర్నాలు
- మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటలో పంటను తగలబెట్టేందుకు యత్నించిన రైతు

- అన్నదాత ఆక్రందన



ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాపయ్యపల్లి బస్టాండ్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

నమస్తే నెట్‌వర్క్, మే 2 : 'చేతికొచ్చిన పంటను కొనుగోలు కేంద్రంలో పోసినం. కాంటా వెయ్యమంటే రేపు మాపు అంటున్నరు. 25 రోజులైనా పట్టించుకునేటోళ్లు లేరు. రాత్రింబవళ్లు కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపులు కాస్తున్నం. గన్నీ బ్యాగులు లేవని, లారీలు వస్తలేవని సాకులు చెప్తున్నరు. వర్షమొస్తే కప్పడానికి టార్పాలిన్లు లేవు. అష్టకష్టాలు పడి పంట పండిస్తే కొనుగోళ్లలో జాప్యం చేస్తున్నారు. ధాన్యం తడిస్తే ఎవరు బాధ్యులు?' అంటూ రైతులు మండిపడుతున్నారు. సహనం కోల్పోతున్న రైతులు రోడ్లపై ధర్నా, రాస్తారోకోలు చేస్తున్నారు. శుక్రవారం కూడా చాలాచోట్ల రైతులు రోడ్డెక్కారు.

### ఓపిక నశించి ధాన్యం తగలబెట్టే ప్రయత్నం

మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో రైతు అంకం నాగయ్య 25 రోజుల క్రితం ధాన్యం పోశాడు. ఐదు రోజుల క్రితం తేమ శాతం చూసి 13 ఉన్నదని తెలిపారు. ఎండబెట్టిన వడ్లకు తేమ శాతం వచ్చినా కాంటా పెట్టలేదు. వర్షం వచ్చే అవకాశం ఉండటంతో రోజూ వడ్లపై టార్పాలిన్ కప్పుతున్నాడు. ఓపిక నశించడంతో రైతు నాగయ్య కుమారుడు రామకృష్ణ శుక్రవారం కొనుగోలు కేంద్రంలోనే ధాన్యం కుప్పపై శానిటైజర్ పోసి తగలబెట్టేందుకు యత్నించగా తోటి రైతులు అడ్డుకున్నారు. కొందరు రైతుల వద్ద డబ్బులు తీసుకొని, తేమ శాతం లేకపోయినా కాంటాలు పెడుతున్నారని సదరు రైతు వాపోయాడు.

### 15 రోజులైనా దిక్కులేదు..

మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం జగ్గుతండాకు చెందిన రైతు బానోత్ చంద్రు 15 రోజుల క్రితం బయ్యారంలోని కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చాడు. అప్పటి నుంచి కాంటా పెడ్తలేరు. తేమ శాతం అంటూ కొన్ని రోజులు, రేపుమాపు అంటూ 15 రోజులుగా కాలయాపన చేశారని రైతు మండిపడ్డారు. శుక్రవారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షానికి కొనుగోలు కేంద్రంలోని ధాన్యంపై టార్పాలిన్లు కప్పి కాపాడే ప్రయత్నం చేసినా తడిసిపోయిందని వాపోయాడు. అప్పులు తెచ్చి పెట్టుబడి పెడితే నష్టపోవాల్సిన పరిస్థితి దాపురించిందని అసహనం వ్యక్తంచేశాడు. కొనుగోలు కేంద్రంలో అనేక మంది రైతులు తడిసిన ధాన్యాన్ని చూసి దుఃఖంలో మునిగిపోయారు. కాంటా వేస్తలేరని సూర్యాపేట మండలం రాజానాయక్ తండాలో ఐకేపీ సెంటర్ వద్ద శుక్రవారం రైతులు ఆందోళనకు దిగారు. సూర్యాపేట – జనగామ రహదారి టోల్‌గేట్ వద్ద సుమారు గంట సేపు రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఐకేపీ సెంటర్‌లో ఐదు రోజులకు ఒక్క లారీ వస్తున్నదని, ధాన్యం కాంటా వేయకపోవడంతో పశువులు ధాన్యాన్ని మేస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. అకాల వర్షాలతో ఇబ్బంది పడుతున్నామని, వెంటనే ధాన్యం కొనుగోలు చేస్తే సమస్య ఉండదని తెలిపారు. రహదారిపై ధర్నా చేయడంతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. ధాన్యం కొంటలేరని ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాపయ్యపల్లి బస్టాండ్ వద్ద రైతులు ఆందోళనకు దిగారు. ధాన్యం కొనుగోలు చేయకపోవడంతోపాటు క్వింటాకు 10 కిలోలు తరుగు తీస్తున్నారని మండిపడుతూ ధర్నాకు దిగారు. అకాల వర్షానికి ధాన్యం తడిసిపోయిందని, మరి కొంత కొట్టుకుపోవడంతో తీవ్రంగా నష్టపోయమని వాపోయారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేటలో రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు రోడ్డుపై బైఠాయించారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన బస్తాలు మిల్లులకు తరలించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అకాల వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నా.. సర్కారు కొనుగోలు వేగవంతం చేయడం లేదని మండిపడ్డారు.

### జొన్న కొనుగోళ్లలోనూ జాప్యమే...

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని మార్కెట్‌యార్డులో జొన్న పంటను విక్రయించేందుకు మండుటెండలో రైతన్నలు ముప్పుతిప్పలు పడుతున్నారు. అధికారులు ముందుగా సూచించిన విధంగా రైతులు మార్కెట్‌యార్డుకు ఒకరోజు ముందు సాయంత్రం తీసుకువస్తున్నారు. రాత్రి మార్కెట్‌యార్డులో పంటకు కాపలా ఉంటున్నారు. మరుసటి రోజు కొనాల్సి ఉన్నా జాప్యం జరుగుతున్నది. పంటను పరిశీలించి పాసింగ్‌కు రాయాలంటూ రైతులు పీఏసీఎస్ సిబ్బంది వెంట తిరుగుతున్నారు. సిబ్బంది వచ్చి పంటను ఎప్పుడు కొనుగోలు చేస్తారోనని పడిగాపులుకాస్తున్నారు. తమ గోడు ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు మండిపడుతున్నారు.

- ధాన్యం కొనే వరకు కదలం



సూర్యాపేట మండలం రాజానాయక్‌తండా వద్ద రహదారిపై బైఠాయించిన రైతులు

- ధాన్యం రాశులు.. మేసిన పశువులు



సూర్యాపేట జిల్లా రాజానాయక్‌తండా ఐకేపీ కేంద్రంలో ఆరబోసిన ధాన్యం తింటున్న బర్రెలు

- పంటను కాపాడుకునేందుకు పడిగాపులు





ఆదిలాబాద్‌లోని మార్కెట్‌యార్డులో రైతులు జొన్నలను విక్రయించేందుకు మండుటెండలో తిప్పలు పడుతున్నారు. అధికారులు చెప్పినట్టుగానే ఒకరోజు ముందుగా ధాన్యాన్ని మార్కెట్‌కు తీసుకొచ్చినా నిరీక్షించాల్సి వస్తున్నది. ధాన్యాన్ని పరిశీలించి, పాసింగ్‌కు రాయాలంటూ రైతులు పీఏసీఎస్ సిబ్బంది వెంట తిరగాల్సి వస్తున్నది. రకరకాల సాకులు చెప్తూ వారు తిప్పలు పెడుతున్నారని, ధాన్యం కొనుగోలులో జాప్యం చేస్తున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు. మరోవైపు అకాలవర్షాల కారణంగా పంట నష్టపోకుండా ఉండేందుకు ధాన్యం దగ్గరే పడిగాపులు కాస్తూ.. కంటికిరెప్పలా కాపాడుకుంటున్నారు. భోజనం కూడా అక్కడికే తెప్పించుకుని తింటున్నారు. ఎదురుచూసి అలసిపోయి, అక్కడే నిద్రిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, త్వరగా ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

- కంటికి రెప్పలా కాపాడుతూ.. అక్కడే కునుకుతీస్తూ



ఓ వైపు ఎండలు మండిపోతున్నాయి. మరోవైపు ధాన్యం కొనుగోలు కోసం మార్కెట్లో నిరీక్షించాల్సి వస్తున్నది. దీంతో ఆదిలాబాద్ మార్కెట్‌లో జొన్నల వద్దే నిద్రిస్తున్న రైతు